www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 4 ఆగస్టు 2024
5
పశ్చిమ గోదావరి

85 శాతం సబ్సిడీపై విత్తనాలు అందించేందుకు చర్యలు

మండల వ్యవసాయాధికారి నారాయణరావు

పాలకోడేరు : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న నారుమడులకు తిరిగి నారుమడులు పోసుకునే విధంగా రైతులకు వ్యవసాయ శాఖ ద్వారా 85 శాతం విత్తనాలను సబ్సిడీపై అందించేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందని మండల వ్యవసాయ అధికారి వి.నారాయణరావు తెలిపారు. గరగపర్రు, కోరుకొల్లు, మొగల్లు, కుముదవల్లి, పాలకోడేరు, శృంగవృక్షం రైతు భరోసా కేంద్రాల్లో ఎంటియు 1153 విత్తనాలను అందుబాటులో ఉంచడం జరిగిందని తెలిపారు. ముంపుకు గురైన నారుమడుల స్థానంలో తిరిగి మరలా నారుమడులు పోసుకునే రైతులు వెంటనే సంబంధిత రైతు సేవా కేంద్రాలలో సంప్రదించాలన్నారు. 80 శాతం సబ్సిడీపై అందించే విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

వేధింపులు.. తొలగింపులు..!

స్కీంవర్కర్లపై కొనసాగుతున్న దారుణకాండ
ప్రభుత్వ పెద్దల ఆలోచనలకు భిన్నంగా క్షేత్రస్థాయిలో పరిస్థితి
అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన, విఒఎలు, ఆర్‌పి, పంచాయతీల్లో పనిచేసే స్కీం ఉద్యోగులే టార్గెట్
ఏళ్ల తరబడి పనిచేస్తున్న స్కీం ఉద్యోగులను అన్యాయంగా తొలగింపు
ఏలూరు జిల్లాలో ఇప్పటి వరకూ 70 మందికిపైగా ఉద్యోగులపై వేటు
'పశ్చిమ'లోనూ కొనసాగుతున్న బెదిరింపుల పర్వం
నాయకుల కక్షపూరిత చర్యలకు వంతపాడుతున్న అధికారులు
రేపు కలెక్టరేట్ల వద్ద స్కీం వర్కర్ల ఆందోళన బాట

'గత ప్రభుత్వానికి భిన్నంగా తమ పాలన ఉంటుంది. ఉద్యోగులపై వేధింపులు, కక్షపూరిత ధోరణలు ఉండవు. రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తాం. ఎంఎల్‌ఎలు, స్థానిక నాయకులు సైతం అదేవిధంగా నడుచుకోవాలంటూ సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ తమ సమావేశాల్లో పదేపదే చెబుతున్నారు. ప్రభుత్వ పెద్దల మాటలు లక్ష్యపెట్టకుండా క్షేత్రస్థాయిలో స్థానిక నాయకులు మాత్రం చిరుద్యోగులపై వేధింపుల పర్వం కొనసాగిస్తూ ఏళ్ల తరబడి పనిచేస్తున్న చిరుద్యోగులను నిర్దాక్షణ్యంగా తొలగిస్తున్న పరిస్థితి కొనసాగుతోంది. నాయకుల కక్షపూరిత చర్యలకు అధికారులు వంత పాడుతుండడంతో ఎంతోమంది చిరుద్యోగులు బలిపశువులుగా మారుతున్న పరిస్థితి. ఏలూరు జిల్లాలో ఇప్పటికే పదుల సంఖ్యలో స్కీం వర్కర్లు తమ ఉద్యోగాలను కోల్పోగా, పశ్చిమలోనే బెదిరింపుల పర్వం కొనసాగుతోంది. దీంతో స్కీం వర్కర్లపై వేధింపులు ఆపాలని, ప్రభుత్వ పెద్దలు జోక్యం చేసుకుని న్యాయం చేయాలని సోమవారం కలెక్టరేట్ల వద్ద చిరుద్యోగులంతా ఆందోళనకు సిద్ధమైన పరిస్థితి నెలకొంది.

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ప్రభుత్వాలు మారినప్పుడల్లా చిరుద్యోగులైన స్కీం వర్కర్లపై స్థానిక రాజకీయ నాయకులు వ్యవహరిస్తున్న తీరు అత్యంత దారుణంగా మారుతోంది. ఏళ్ల తరబడి పనిచేస్తూ వచ్చే కొద్దిపాటి జీతంతోనే ఇల్లు నెట్టుకొస్తున్న కుటుంబాలకు తీరని వేదనను మిగిలిస్తున్న పరిస్థితి నెలకొంది. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక ప్రభుత్వ పెద్దల ఆలోచనలకు భిన్నంగా క్షేత్రస్థాయిలో పరిస్థితి కొనసాగుతోంది. స్కీం వర్కర్లుగా పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు, అంగన్‌వాడీ ఉద్యోగులు, ఐకెపిలో పనిచేసే విఒఎలు, మెప్మాలోని ఆర్‌పిలు, పంచాయతీ కార్మికులు వివిధ విభాగాల్లో పనిచేస్తున్న అనేక మంది చిరుద్యోగులపై వైసిపి ముద్రవేసి ఉద్యోగాల నుంచి తొలగిస్తున్న తీరు అందరినీ విస్మయానికి గురిచేస్తోంది. స్థానిక నాయకులకు, అధికారులకు కొమ్ముకాస్తుండడంతో ఈ పరిస్థితి అత్యంత దారుణంగా కొనసాగుతోంది. ఏలూరు జిల్లాలో పరిస్థితి అత్యంత దారుణంగా ఉండడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. పెదవేగి మండలంతోపాటు, ద్వారకాతిరుమల, దెందులూరు, లింగపాలెం, కుక్కునూరు, ఉంగుటూరు, ఏలూరు పట్టణం, జంగారెడ్డిగూడెం వంటి అనేక మండలాల్లో అంగన్‌వాడీ, విఒఎలు, ఆర్‌పిలు, మధ్యాహ్న భోజన, పంచాయతీ కార్మికులుగా పనిచేస్తున్న చిరుద్యోగులను గడిచిన రెండు నెలల కాలంలోనే 70 మందికిపైగా తొలగించినట్లు తెలుస్తోంది. ఇంకా అనేకమందిపై వేధింపుల పర్వం కొనసాగుతోంది. పశ్చిమగోదావరి జిల్లాలోని పోడూరు, పెనుగొండ, భీమవరం, ఉండి వంటి పలు మండలాల్లో పనిచేస్తున్న స్కీంవర్కర్లపై వేధింపులు కొనసాగుతున్న పరిస్థితి నెలకొంది. నాయకులు కక్షసాధింపులతో ఎన్నో కుటుంబాలు ఉపాధి కోల్పోయి రోడ్డున పడుతున్న పరిస్థితి. ఎన్నికల్లో తమకు అనుకూలంగా చేయాలేదంటూ ఆరోపణలు మోపుతూ వేధింపులకు పాల్పడుతున్నారంటూ స్కీం వర్కర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ప్రభుత్వ పెద్దలు జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలంటూ స్కీం వర్కర్లు ఆందోళన బాట పట్టేందుకు సిద్ధమయ్యారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు కాకముందే ఇటువంటి పరిస్థితి రావడం సర్వత్రా చర్చ చర్చనీయాశంగా మారింది.

నాయకుల దౌర్జన్యాలకు కొమ్ముకాస్తున్న అధికారులు

స్కీం వర్కర్ల తొలగింపులపై అధికారులు వ్యవహరిస్తున్న తీరు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. స్కీం వర్కర్లుగా పనిచేస్తున్న వారిపై నాయకులు వచ్చి అధికారులకు ఏదైనా చెబితే ఉద్యోగి నిబద్ధత పరిస్థితిని వివరించకుండా అధికారులు కొమ్ముకాస్తున్నారని తెలిసింది. ముందుగా మీరు సదరు ఉద్యోగిపై ఫిర్యాదు చేయాలని, తర్వాత తాము చర్యలు తీసుకుంటామంటూ నాయకులకు అధికారులే సలహాలిస్తున్నారంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాజకీయ నాయకుల నుంచి ఫిర్యాదులు తీసుకుని తనిఖీల పేరుతో హడావుడీ మెమోలు జారీచేయడం వంటి చర్యలకు పాల్పడుతున్నారు. సదరు ఉద్యోగి బాగా పనిచేస్తారని గానీ, పనిలో ఎటువంటి ఇబ్బందులు లేవని గానీ నాయకులకు చెప్పడం లేదు. దీంతో స్కీం వర్కర్లపై వేధింపులు యథేచ్ఛగా సాగుతున్న పరిస్థితి నెలకొంది.

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ నాగరాణి

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి జిల్లా ఉన్నతాధికారులను ఆదేశించారు. ఆగష్టు 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణపై శనివారం స్థానిక కలెక్టరేట్లో ఇన్‌ఛార్జి జిల్లా జాయింట్ కలెక్టర్ జె.ఉదయభాస్కరరావుతో కలిసి జిల్లా అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ముఖ్యఅతిథి హాజరై త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరిస్తారన్నారు. అనంతరం వారి ప్రసంగం, స్వాతంత్ర్య సమర యోధులతో పరిచయ కార్యక్రమం, మాక్ డ్రిల్, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రశంసాపత్రాలు అందజేయడం జరుగుతుందన్నారు. ప్రతిష్టాత్మక పరేడ్ కార్యక్రమాన్ని పోలీస్ శాఖ నిర్వహించాలని, వేదిక ఏర్పాట్లను రెవెన్యూ డివిజనల్ అధికారి, తహశీల్దార్ పర్యవేక్షిస్తారని తెలిపారు. గృహ నిర్మాణ శాఖ, జిల్లా పౌర సరఫరాల శాఖ, విద్యాశాఖ, వ్యవసాయ శాఖ, వైద్య ఆరోగ్యశాఖ, అగ్నిమాపక శాఖ, డ్వామా, డిఆర్‌డిఎ, మత్స్య శాఖ, తదితర శాఖలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇనుమడింపజేసేలా శకటాలను ప్రదర్శించాలని, ఆకర్షణీయంగా ఎగ్జిబిషన్ స్టాల్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అవార్డుల కోసం ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగుల వివరాలు అందజేయాలన్నారు. ప్రతి శాఖ నుంచి ఇద్దరు లేదా ముగ్గురు వ్యక్తులకు మాత్రమే అవకాశం కల్పించాలని సూచించారు. అలాగే పాఠశాలల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని, వాతావరణాన్ని దృష్టిలో ఉంచుకొని అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ డివిజనల్ అధికారి ఎం.అచ్యుత్ అంబరీష్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తమది రైతు పక్షపాత ప్రభుత్వం

రైతులకు పశువుల దాణా పంపిణీ చేసిన మంత్రి నిమ్మల రామానాయుడు

రైతులకు పశువుల దాణా పంపిణీ చేస్తున్న మంత్రి నిమ్మల

ప్రజాశక్తి - యలమంచిలి

జగన్ ఐదేళ్ల పాలనలో వ్యవసాయాన్ని, రైతులను గాలికి వదిలేశారని, తమది రైతు పక్షపాత ప్రభుత్వమని రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. శనివారం మండలంలోని అబ్బిరాజుపాలెం వరద ముంపులో సుమారు మూడు లక్షల విలువ గల పది టన్నుల పశువుల దాణాను రైతులకు మంత్రి నిమ్మల పంపిణీ చేశారు. ముందుగా మంత్రి రామానాయుడుకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన వరద బాధితులతో పాటు రైతులను పరామర్శించారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి మంత్రి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రైతు పక్షపాత ప్రభుత్వంగా పనిచేస్తోందన్నారు. వైసిపి హయాంలో రైతులు పంట పండించుకోలేని పరిస్థితుల్లో పంట విరామం తీసుకున్నారని తెలిపారు. జగన్ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకినెట్టి ప్రభుత్వ కార్యాలయాలు, విలువైన ప్రభుత్వ భూములను సైతం లక్షలాది కోట్ల రూపాయలకు తాకట్టు పెట్టారని తెలిపారు. తమ ప్రభుత్వం ఒకే రోజు రికార్డు స్థాయిలో పింఛన్లు పంపిణీ చేసిందని, తట్టుకోలేని జగన్ తన సొంత పత్రికలో అసత్యాలు, అబద్ధాలు రాస్తోందన్నారు. ముంపు ప్రాంతాల్లో పశువులకు దాణా సైతం పంపిణీ చేస్తున్నామన్నారు. జిల్లా మొత్తం మీద 4,202 పశువులకు సంబంధించి సుమారు 17.53 లక్షల విలువైన 111 టన్నుల దాణా, 1475 మంది రైతులకు తమ ప్రభుత్వం అందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సంచాలకులు జి.మల్లేశ్వరరావు, మండల పశువైద్యాధికారి డాక్టర్ పి.చంద్రశేఖరరెడ్డి, మండల అధికారులు, సచివాలయం సిబ్బంది, గ్రామ సర్పంచి కామిశెట్టి సాయిబాబా, నాయకులు పాల్గొన్నారు.

స్కీం వర్కర్లపై వేధింపులు ఆపాలి

ఈ నెల 5న భీమవరం కలెక్టరేట్ వద్ద ధర్నా
సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గోపాలన్, రాయ్

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రాయ్

ప్రజాశక్తి - భీమవరం

టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చిరుద్యోగులు స్కీం వర్కర్లపై వేధింపులు రోజురోజుకూ పెరుగుతున్నాయని, తక్షణం వేధింపులను ఆపాలని సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జెఎన్‌వి గోపాలన్, కె.రాజా రామ్మోహన్ రాయ్ డిమాండ్ చేశారు. కార్మికులపై వేధింపులు ఆపాలని కోరుతూ సిఐటియు రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు ఈ నెల 5వ తేదీన భీమవరం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. అంగన్వాడీలు ఆశాలు మధ్యాహ్న భోజన కార్మికులు ఐకెపి ఫీల్డ్ అసిస్టెంట్లు పంచాయతీ కార్మికులు వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులంతా తరలిరావాలని పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లాలో వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులపై వేధింపులు పెరిగాయన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం వచ్చాక ఇవి మరింత పెరగడం బాధాకరమన్నారు. తక్షణం రాష్ట్ర ప్రభుత్వం వేధింపులు అరికట్టి, చిరు ఉద్యోగులు, స్కీం వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో డి.కళ్యాణి, బి.వాసుదేవరావు, ఎం.ఆంజనేయులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఎంఎల్‌ఎ అంజిబాబుకు డేటా ఎంట్రీ ఆపరేటర్ల వినతి

ఎంఎల్‌ఎ అంజిబాబు వినతిపత్రం అందజేస్తున్న డేటా ఎంట్రీ ఆపరేటర్లు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న ఇ - పంచాయత్ డేటా ఎంట్రీ ఆపరేటర్లు ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు)ను కోరారు. శనివారం ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయంలో భీమవరం నియోజకవర్గం, వీరవాసరం మండలం ఈ పంచాయత్ డేటా ఎంట్రీ ఆపరేటర్లు ఎంఎల్‌ఎ అంజిబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డేటా ఎంట్రీ ఆపరేటర్లు గాడి శివాజీ, డి.జయబాబు, చల్లగండ్ల హర్ష మణికంఠ, తాటిపర్తి అచ్యుతరావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో సుమారుగా 2000 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లుగా పని చేస్తున్నామని తెలిపారు. అతి తక్కువ వేతనంతో పని చేస్తున్నామని, గత ప్రభుత్వంలో ఎటువంటి న్యాయం జరగలేదని తెలిపారు. ఉద్యోగ భద్రత చేకురేలా చూడాలన్నారు. నూతనగా ప్రవేశపెట్టిన పంచాయతీ కార్యదర్శి గ్రేడ్-6 డిజిటల్ అసిస్టెంట్ పోస్టులు మొదట ప్రాధాన్యత కల్పించాలని కోరారు. దీనిపై ఎంఎల్‌ఎ మాట్లాడుతూ డేటా ఎంట్రీ ఆపరేటర్ల సమస్యల పరిష్కారానికి కషి చేస్తానని అన్నారు. వినతిపత్రం అందించిన వారిలో కె.సంతోష్ కుమార్, వైడి సాయి కృష్ణ, కె.ఫణి శ్రీనివాస్, వి.రాజు ఉన్నారు.

పెదమైనవానిలంక కోత నిరోధక కట్ట నిర్మాణానికి త్వరలో టెండర్

జిల్లా కలెక్టర్ నాగరాణి



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

నరసాపురం మండలం పెదమైనవానిలంక గ్రామం వద్ద కోత నిరోధక కట్ట నిర్మాణానికి టెండర్స్‌ను త్వరలో ఖరారు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్, స్టీరింగ్ కమిటీ ఛైర్మన్ చదలవాడ నాగరాణి తెలిపారు. శనివారం స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్ నాగరాణి స్టీరింగ్ కమిటీ మెంబర్లతో జూమ్ కాన్ఫరెన్స్‌ను నిర్వహించి, ప్రాజెక్ట్ టెండర్‌పై బిల్డర్లకు తలెత్తిన సందేహాలపై చర్చించడం జరిగింది. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ దత్తత గ్రామమైన పెదమైనవానిలంక సముద్రం కోతకు గురైన గ్రామంలోనికి సముద్రం నీరు చొచ్చుకు వస్తుందని గ్రామస్తులు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రికి విన్నవించుకోవడంతో, ఆమె ఈ విషయమై ఆలోచన చేసి డెలాయిట్ టచ్ తోహ్మట్సు ఇండియా ఎల్‌ఎల్‌పికి రక్షణ చర్యలకు అప్పగించడం జరిగిందన్నారు. వారు యాంటీ ఎరోజన్ కట్ట గోడ నిర్మాణానికి ప్రతిపాదించగా, పెదమైనవానిలంక గ్రామస్తుల అభ్యర్థన మేరకు నరసాపురం మండల సర్వేయర్ సర్వే నిర్వహించి అలైన్‌మెంట్‌ను గుర్తించినట్లు తెలిపారు. ఒక కిలో మీటర్ ప్రాంతానికి తీరప్రాంత రక్షణ చర్యలను అందించడం కోసం డెలాయిట్ ఇండియా ఆధ్వర్యంలో కోత నిరోధక కట్ట నిర్మాణానికి ప్రతిపాదించి జూన్ నెలలో టెండర్లను పిలవడం జరిగిందన్నారు. డెలాయిట్ ఇండియా తన సిఎస్‌ఆర్ నిధి నుంచి ఈ ప్రాజెక్టును చేపట్టనుందన్నారు. పెదమైనవానిలంక గ్రామం వద్ద ఒక కిలో మీటర్ ప్రాంతానికి తీరప్రాంత రక్షణ చర్యలను కోత నిరోధక కట్ట నిర్మాణానికి వచ్చిన ఆన్లైన్ టెండర్లను ఈనెల 19న తెరిచి, ఖరారు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ జూమ్ కాన్ఫరెన్స్‌లో జల వనరుల శాఖ ఎస్‌ఇ సిహెచ్.దేవప్రకాష్, నరసాపురం ఆర్‌డిఒ బి.అచ్యుత్ అంబరీష్, జల వనరుల శాఖ ఇఇ పి.సుబ్రహ్మణ్యేశ్వరరావు, డిఇఇ జి.వినోద్ చంద్, ఎపిపిసిబి, డెలాయిట్ ఇండియా, మద్రాస్ ఐఐటిల ప్రతినిధులు పాల్గొన్నారు.

వయనాడ్ బాధితులను ఆదుకోవాలి

సిపిఎం నాయకుల విరాళాల సేకరణ



ఉండి : విరాళాలు సేకరిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - పాలకోడేరు

కేరళలో ఇటీవల సంభవించిన ప్రకృతి వైపరీత్యాలకు వయనాడ్ అతలాకుతలం అవ్వడమే కాకుండా వందలాది మంది ప్రాణాలు కోల్పోయారని, వారిని ఆదుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి గోపాలన్ కోరారు. జిల్లాల్లో, కేరళలో వరద బాధితులను ఆదుకోవాలని కోరుతూ విస్సాకోడేరు గ్రామంలో సిపిఎం ఆధ్వర్యంలో శనివారం విరాళాలు స్వీకరించారు. స్థానిక సెంటర్‌లో ఉన్న షాపులతోపాటు ఇంటింటా తిరిగి జోలు పట్టి ప్రతీ వ్యక్తి నుంచి సిపిఎం నాయకులు, కార్యకర్తలు విరాళాలు స్వీకరించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గోపాలన్ మాట్లాడుతూ ఇటీవల సంభవించిన ప్రకృతి వైపరీత్యం తీవ్ర నష్టాన్ని మిగిల్చిందన్నారు. ప్రాణ, ఆస్తినష్టం కూడా సంభవించడం బాధాకరమన్నారు. జిల్లాలో వ్యవసాయంతో పాటు అనేక ఉద్యాన పంటలు కూడా సర్వనాశనం అయ్యాయన్నారు. ముఖ్యంగా రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ప్రధాన పాత్ర పోషిస్తున్న సిపిఎం ప్రజాసేవలో కూడా నిత్యం ముందుంటుందని చెప్పారు. సిపిఎం ఆధ్వర్యంలో జిల్లాలో వరద బాధితుల సహాయార్థం విరాళాలు స్వీకరించడం జరుగుతుందని, దీనికి ప్రతిఒక్కరూ సహాయ సహకారం అందించి బాధితులకు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి శేషాపు ఆశ్రయ, నాయకులు క్రాంతి బాబు, కలిదిండి గోపాలరాజు, చేబోలు శ్రీను, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెనుగొండ: కేరళ రాష్ట్రంలో జల ప్రళయం సృష్టించిన విపత్తులో వందలాదిమంది చనిపోవడంతో పాటు నిలువ నీడ లేకుండా పోవటంతో ఆ రాష్ట్రానికి పెనుగొండ మండల కేంద్రంలో ప్రజలు తమకు తోచిన విధంగా విరాళాలు అందించారు. మంగళవారం సిపిఎం ఆధ్వర్యంలో ఆ పార్టీ నేత కె.గోపాలన్ ఉదయం గంట పాటు మెయిన్ రోడ్‌లో జోలి పట్టి సహాయం కోసం అభ్యర్థించారు. పలువురు స్వచ్ఛందంగా విరాళాలు అందించి సంఘీభావం తెలిపారు. రూ.5,510 సేకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి ఎస్.వెంకటేశ్వరరావు, షేక్ పాదుషా, నాగిశెట్టి గంగారావు, మాదాసు నాగేశ్వరరావు, శీలం యేసు, తోట నాగేశ్వరరావు, నీలాపు ఆదినారాయణ పాల్గొన్నారు.

ఉండి: ప్రకృతి వైపరీత్యాల వల్ల కలిగే అనర్థాలకు గురైన బాధితులకు ప్రతి ఒక్కరూ అండగా నిలబడాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి గోపాలన్ పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం కేరళ రాష్ట్రంలోని వయనాడ్ బాధితుల సహాయార్థం ఉండి మెయిన్ సెంటర్లో విరాళాల సేకరణను సిపిఎం ఉండి మండల కార్యదర్శి ధనికొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జెఎన్‌వి గోపాలన్ మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొన్ని రాష్ట్రాలు అతలాకుతలమైపోయాయని వాపోయారు. కేరళ రాష్ట్రంలోని వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడి వందలాదిమంది తీవ్ర గాయాల పాలై దుర్మరణం చెందారని, వరదల బీభత్సం వల్ల వేలాదిమంది ప్రాణాలు కోల్పోవడమే కాకుండా ఆవాసాలు కోల్పోయారని, అటువంటి బాధితులకు ప్రతి ఒక్కరు తమ వంతు సహాయంగా విరాళాలు ఇచ్చి ఆదుకోవాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు రామకూరి వెంకటరత్నం, నక్కా వెంకటేశ్వర్లు, వీరవల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

భీమవరం : ఇటీవల కురిసిన భారీ వర్షాలు, కేరళలో సంభవించిన విపత్తు వల్ల నష్టపోయిన ప్రజలను ఆదుకోవడం కోసం సిపిఎం ఆధ్వర్యంలో శనివారం భీమవరంలో విరాళాల సేకరణ చేపట్టారు. స్థానిక మావుళ్లమ్మ గుడి, కెఎల్‌ఎం రోడ్లోనూ సిపిఎం కార్యకర్తలు విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా సిపిఎం టౌన్ కార్యదర్శి బి.వాసుదేవరావు మాట్లాడుతూ వయనాడ్ బాధితులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎం.వైకుంఠరావు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, డేగల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆచంట: విపత్తు వేళ కేరళలోని వయనాడకు ప్రజలంతా అండగా నిలవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్ పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం ఆచంట పరిసర ప్రాంతాల నుంచి కేరళ వరద బాధితులకు సిపిఎం ఆధ్వర్యంలో విరాళాల సేకరణ చేపట్టగా రూ.10,502 విరాళాలు వచ్చినట్లు గోపాలన్ తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో గోపాలన్ మాట్లాడుతూ వయనాడ్ బాధితులకు ప్రజలంతా ఉదారభావంగా విరాళాలు ఇచ్చి సంఘీభావాన్ని తెలపాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు సిర్రా నరసింహమూర్తి, ఎస్‌విఎన్.శర్మ, పి.మోహన్ రావు, కుసుమే జయరాజు పాల్గొన్నారు.

పెనుగొండ: విరాళాలు సేకరిస్తున్న సిపిఎం నాయకులు

జీతాలు ఇవ్వకపోతే బతికేది ఎలా ?

గొల్లలకోడేరు పంచాయతీ కార్యాలయం వద్ద కార్మికుల నిరసన

ప్రజాశక్తి - పాలకోడేరు

నాలుగు నెలల నుంచి జీతాలు చెల్లించకపోతే తాము ఎలా బతికేది అంటూ గొల్లలకోడేరు పంచాయతీ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం కార్మికులు తమకు జీతాలు అందించాలని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ వాటర్ వర్క్స్, ఎలక్ట్రికల్ పనులతో పాటు వివిధ క్యాటగిరీలో పంచాయతీలో అనేక సేవలు అందిస్తున్నామన్నారు. ఎన్నో ఏళ్ల నుంచి పంచాయతీలో పని చేస్తున్నామని, అయితే ఇటీవల కావాలనే కొంతమంది తక్కువ టెండర్ వేయడంతో పంచాయతీ కూడా ఆమోదం తెలిపిందన్నారు. అయితే పంచాయతీ ఆమోదం తెలిపిన ఇద్దరు వ్యక్తుల్లో ఒక వ్యక్తి రెండు నెలలు సెలవు పెట్టి వెళ్లారని మరో వ్యక్తి అప్పటి నుంచి ఇప్పటికి విధులకు హాజరు కాలేదని చెప్పారు. అయితే గతం నుంచి తాము పంచాయతీలో పనిచేయడంతో పాలకవర్గం తమ టెండర్లను ఆమోదించడం జరిగిందని తెలిపారు. కేవలం కొంతమంది దురుద్దేశంతోటే తమను పనులు చేయకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. ఇది కూడా చాలదని ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు జీతాలు చెల్లించకుండా నిలుపుదల చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపైనే ఆధారపడి జీవిస్తున్న తమకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. చివరకు అప్పులు చేసుకుని జీవనం సాగించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. జిల్లా పంచాయతీ అధికారి విక్టర్, ఇఒపిఆర్‌డి రామాంజనేయులు సంఘటనా స్థలానికి చేరుకుని పంచాయతీ కార్మికులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ధర్నా ముగించారు.

విద్యార్థినులు లక్ష్యం మేరకు చదవాలి

పాలకొల్లు : విద్యార్థినులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఇష్టపడి చదివితే ఉన్నత స్థానంలో నిలుస్తారని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. మంత్రి శనివారం పాలకొల్లులోని దాసరినారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జరిగిన 42వ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. ఆనాడు చదువుకు ఎన్నో ఇబ్బందులు పడినా ప్రపంచవ్యాప్తంగా చరిత్రలో గొప్ప వ్యక్తులుగా నిలిచిన డాక్టర్ బిఆర్.అంబేద్కర్, అబ్దుల్ కలాం వంటి ఎందరినో ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కళాశాలకు ఎన్‌ఎఎసి గుర్తింపు పొందడం పట్ల ప్రిన్సిపల్ డాక్టర్ పిల్లి శోభారాణి, కళాశాల అధ్యాపకులను, అధ్యాపకేతర సిబ్బందిని మంత్రి రామానాయుడు అభినందించారు. టిడిపి ప్రభుత్వం మహిళా పక్షపాతి అని, ఎప్పుడు అధికారం చేపట్టినా మహిళలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి చెప్పారు. మహిళలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించింది, ఆస్థిహక్కు కల్పించింది టిడిపి అన్నారు. కళాశాలకు కోటి రూపాయలు 5 సంవత్సరాల కిందట మంజూరైన నిధులు రాలేదని ప్రిన్సిపల్ మంత్రి దృష్టికి తీసుకెళ్లగా నిధులు విడుదలకు కృషిచేస్తానని చెప్పారు. ఆర్‌జెడి డాక్టర్ శోభారాణి, కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులు ఉన్నారు.

'జనసేన పథకాలు కూడా అమలు చేయాలి'

పాలకొల్లు: ఎన్‌డిఎ కూటమి ఉమ్మడి మేనిఫెస్టోలో టిడిపి పెట్టిన సూపర్ సిక్స్ పథకాలతో పాటు జనసేన ప్రతిపాదించిన పథకాలను కూడా అమలు చేయాలని కాపు, బలిజ సేన అధ్యక్షులు చేగొండి హరిరామ జోగయ్య కోరారు. పేద ప్రజలకు ఆర్థికాభివృద్ధికి సూపర్ సిక్స్ పథకాలు ఎంతగా ఉపయోగపడతాయో షణ్ముఖ వ్యూహంలో మరికొన్ని పథకాలు అంతకుమించి ఉపయోగపడతాయని జోగయ్య తెలిపారు. ప్రతీ నియోజకవర్గంలో ప్రతి సంవత్సరం 100 మంది చొప్పున 5 సంవత్సరాలలో 500 మంది అర్హత కలిగిన వారిని ఎంపిక చేసి, మరో ఐదుగురు ఉపాధికి తోడ్పడేటట్లు చిన్న మధ్య తరహా పరిశ్రమలు కానీ, వ్యాపార సంస్థలు గాని స్థాపించిన నిరుద్యోగ యువకులకు రూ.10 లక్షల వరకూ సబ్సిడీ అందజేసే సౌభాగ్య పథకం పేరుతో అందజేసే పథకం చాలా బృహత్తరమైన పథకంగా ఆయన తెలిపారు. సూపర్ సిక్స్ పథకాలతో పాటు జనసేన పథకాలు కూడా అమలు చేయాలని ప్రకటన ద్వారా తెలిపారు.

నాయకత్వ లక్షణాలు కలిగి ఉండాలి

గణపవరం: విద్యార్థి కమిటీ నాయకులు నాయకత్వ లక్షణాలతో ఉండాలని గణపవరం డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి అన్నారు. శనివారం ఏలూరులో తాను విద్యాభ్యాసం కొనసాగించిన సెయింట్ థెరిస్సా మహిళా కాలేజీలో జరిగిన యూనియన్ సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ తాను చదువుకున్న కళాశాలకు ముఖ్య అతిథిగా రావడం ఆనందంగా ఉందన్నారు. 2024-25వ సంవత్సరానికి ఎంపికైన విద్యార్థి కమిటీ నాయకులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏలూరు కళాశాల ప్రిన్సిపల్ డా.మేరీ, తెలుగు అధ్యాపకులు జిడిసి వెంకటరమణ పాల్గొన్నారు.

పలు పథకాలపై ప్రజలకు అవగాహన

నరసాపురం: రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ వారి ఆదేశాల మేరకు ఆగస్టు నెలలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాలైన వితంతువులకు ప్రభుత్వ పింఛన్ పథకం, మాదక ద్రవ్యాల నిరోధక చట్టం, మానసిక వికలాంగుల పథకం గురించి ప్రజలకు వివిధంగా అవగాహన సదస్సులు నిర్వహించాలనే విషయంపై న్యాయ సేవా సంస్థ నామినేటెడ్ సభ్యులు, పానెల్ లాయర్, పారా లీగల్ వాలంటీర్లతో నరసాపురం మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు, 10వ అదనపు జిల్లా న్యాయమూర్తి పి.విజయ దుర్గ తమ కోర్ట్ హాల్ నందు సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ప్రభుత్వ అధికారులు కూడా ఈ కార్యక్రమాలలో పాల్గొనాలని న్యాయమూర్తి అన్నారు.

ఆషాడం సారె సమర్పణ

తాడేపల్లిగూడెం: బలుసులమ్మ అమ్మవారి ఆశీస్సులు అందరికీ అందాలని, నియోజకవర్గంతో పాటు రాష్ట్రం మొత్తం సుభిక్షంగా ఉండాలని తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ ఆకాంక్షించారు. తాడేపల్లిగూడెం గ్రామదేవత బలుసులమ్మ అమ్మవారికి శనివారం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి ఆషాడం సారె అందించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేసిన ఆలయ కమిటీ సభ్యులను అభినందించారు.

అత్యాచార నిందితులు అరెస్టు

పాలకొల్లు: గతనెల 29న పాలకొల్లులో జరిగిన వృద్ధురాలు కలిశెట్టి అనసూయపై అత్యాచారం, హత్యాయత్నం కేసులో ఇద్దరు ముద్దాయిలను అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్‌పి అద్నాన్ నయూం అస్మీ చెప్పారు. పాలకొల్లు పట్టణ పోలీస్ స్టేషన్‌లో శనివారం జరిగిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. ముద్దాయిలు బొక్కా రాజు, మీసాల మావుళ్లులను అరెస్టు చేసి వారి నుంచి 49 గ్రాముల బంగారు వస్తువులు, పాత సెల్ వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌పి తెలిపారు. ఇద్దరు నేరస్తులూ పాత నేరస్తులని ఎస్‌పి తెలిపారు. వారి వద్ద నుంచి 49 గ్రాముల బంగారం వస్తువులు స్వాధీనపరుచుకున్నారు. మీడియా సమావేశంలో ఎఎస్‌పి దేవారావు, నర్సాపురం డిఎస్‌పి శ్రీనివాస్, పాలకొల్లు పట్టణ సిఐ మంగాదేవి, ఎస్ఐ బాదం శ్రీనివాస్‌లు పాల్గొన్నారు. జిల్లాలో పెరిగిపోతున్న గంజాయిని అరికడుతున్నట్లు తెలిపారు. యువకులు మధ్య మధ్యలో వేగంగా వాటర్ సైకిల్‌పై తిరగడం నేరాలు, చేయడం జరుగుతుందని, నేరాలు అరికట్టడానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

అన్నా క్యాంటీన్ పనుల పరిశీలన

నరసాపురం: నరసాపురం పట్టణం స్టీమర్ రోడ్డులో ఉన్న అన్నా క్యాంటీన్ పనులను శనివారం నరసాపురం మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు పరిశీలించారు. పనులు నాణ్యతగా, త్వరితగతిన పూర్తి చేయాలని కమీషనర్ గుత్తేదారులకు సూచించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. కమిషనర్ వెంట ఎఇ వై.సునీల్ కుమార్ పాల్గొన్నారు.

'అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి'

ఉండి: మండలంలో ఉండి ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజు ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఆయన తనయుడు కనుమూరి భరత్ టిడిపి శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బిసి బాలుర వసతిగృహం, ఎస్‌సి బాలికల వసతి గృహం, కలిదిండి రామచంద్ర రాజు జన్మభూమి పార్కులలో నిర్వహిస్తున్న అభివృద్ధి పనులను కనుమూరి భరత్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు, పార్టీ అధ్యక్షులు కాగిత బుజ్జి పాల్గొన్నారు.

ఆకివీడు తహశీల్దార్‌గా నండూరి

ఆకివీడు: ఆకివీడు తహశీల్దారుగా నండూరి వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. ఎన్నికల సమయంలో కోనసీమ జిల్లా నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చి తహశీల్దార్‌గా పనిచేసిన జవ్వాది వెంకటేశ్వరి తిరిగి రెండు రోజుల క్రితం కోనసీమకు బదిలీ అయ్యారు. గత మూడు రోజుల నుంచి ఇన్‌ఛార్జిగా డిప్యూటీ తహశీల్దార్ ఫరూక్ వ్యవహరిస్తున్నారు. ఎన్నికలకు ముందు పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండలో తహశీల్దార్‌గా పనిచేసిన నండూరి వెంకటేశ్వరరావు ఎన్నికల సమయంలో మచిలీపట్నం కలెక్టరేట్ ఎన్నికల సూపర్డెంట్‌గా బదిలీ అయ్యారు. తిరిగి ప్రస్తుతం బదిలీలో ఆకివీడు తహశీల్దార్‌గా నియమితులయ్యారు. ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

పెన్షన్ అందక ఆవేదన

పాలకొల్లు రూరల్: మండలంలోని లంకలకోడేరు గ్రామ సచివాలయ పరిధిలో జులైలో ఇవ్వాల్సిన పెన్షన్లు ఆగస్టు నెలలో ఇస్తారని ఎదురు చూస్తే, ఆగస్టు నెల మాత్రమే ఇస్తామని చెప్పారని గ్రామానికి చెందిన దొంగ సీతా మహాలక్ష్మి, దేవ సుబ్బలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై సచివాలయ ఉద్యోగులను సంప్రదించగా ప్రతి నెలా 2వ తేదీ సాయంత్రం 5 గంటల వరకూ మాత్రమే సర్వర్లు పనిచేస్తాయని, తరువాత అవి పని చేయవు అన్నారన్నారు. ఏ నెలకి ఆ నెల మాత్రమే పెన్షన్లు అందించాలని, మిగిలినవి తిరిగి ప్రభుత్వానికి అప్పగించాలని సచివాలయ ఉద్యోగులు తెలియజేశారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

తణుకు : తణుకు పట్టణాన్ని క్లీన్ అండ్ గ్రీన్ పట్టణంగా, పారిశుధ్యంలో ప్రథమ స్థానంలో నిలిపేందుకు ప్రతీఒక్కరూ సహకరించాలని తణుకు నియోజకవర్గ ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలో జరుగుతున్న డ్రెయినేజీ సిల్ట్ పనులను రాధాకృష్ణ పరిశీలించారు. అధికారులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనను పరిశీలించాలి

తణుకు: తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని సివిల్ జడ్జి కె.సత్యకృష్ణలత అన్నారు. శనివారం స్థానిక ఎంపిపి సమావేశ మందిరంలో తణుకు నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి ఆదేశముల మేరకు ఆదర్శ మహిళా మండలి తణుకు వారి సౌజన్యంతో మహిళా సంరక్షణ కోసం చేసిన చట్టాలపై అవగాహన కల్పించారు. న్యాయమూర్తులు మొదటి అదనపు సివిల్ జడ్జి పివి.నాగరంజిత్ కుమార్ పాల్గొన్నారు.

మహిళపై దాడి : కేసు నమోదు

ఉండి: మహిళతో గొడవపడి అసభ్యకరంగా మాట్లాడి దౌర్జన్యానికి దిగిన ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదైన సంఘటన ఉండి మండలం ఉనుదుర్రు గ్రామంలో చోటుచేసుకుంది. ఉనుదుర్రు గ్రామానికి చెందిన సాలిమట్ల నాగలక్ష్మి పాలకోడేరు మండలం గొల్లలకోడేరులో ఉన్న సూర్య బయోటెక్స్ కంపెనీలో పనిచేస్తుండగా ఫిబ్రవరి ఆరో తేదీ రాత్రి సమయంలో ఉనుదుర్రు గ్రామానికి చెందిన కర్రాక యేసు మరో నలుగురు వ్యక్తులు నాగలక్ష్మి పట్ల అసభ్యంగా ప్రవర్తించి ఆమెతో దౌర్జన్యానికి దిగి దాడి చేశారని శనివారం ఉండి పోలీసులకు నాగలక్ష్మి ఫిర్యాదు చేశారు. నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు ఉండి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వ్యక్తిని గాయపరిచిన వారిపై కేసు నమోదు

ఉండి: ఉండి మండలం పాందువ్వ గ్రామానికి చెందిన మాదాసి రామయ్య అనే వ్యక్తిని అదే గ్రామానికి చెందిన లక్ష్మయ్య మహేష్ అనే ఇద్దరు వ్యక్తులు ఈనెల ఒకటో తేదీ రాత్రి సమయంలో అకారణంగా గొడవకు దిగి గాయపరచగా రామయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు లక్ష్మయ్య మహేష్‌లపై ఉండి పోలీస్‌లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

బిడ్డకు తల్లిపాలే శ్రేష్టం

కొనసాగుతున్న తల్లిపాల వారోత్సవాలు



కాళ్ల: బాలింతలకు, తల్లులకు అవగాహన కల్పిస్తున్న అంగన్వాడీలు

భీమవరం: బిడ్డపుట్టిన దగ్గర నుంచి ఆరునెలల వరకూ తల్లిపాలు మాత్రమే పట్టించాలని దుర్గాపురం యుపిహెచ్‌సిహెచ్‌వి జయలక్ష్మి సూచించారు. భీమవరం అర్బన్ పరిధిలోని 36వ వార్డు రామరాజుతోట అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ బిడ్డకు తల్లిపాలు ఎంతో శ్రేష్ఠకరమని చెప్పారు. తల్లిపాలు ఇవ్వడం ద్వారా ఎటువంటి అనారోగ్యాలు ధరి చేరకుండా ఉండడంతో పాటు రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. అనంతరం గర్భిణులు, బాలింతలచే తల్లిపాల ప్రాముఖ్యతపై ప్రతిజ్ఞ చేయించి, పోషకాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్లు, ఆశాలు పాల్గొన్నారు.

గణపవరం: పుట్టిన బిడ్డకు ముర్రిపాలు మొదటి టీకా అని ఐసిడిఎస్ పిప్పర సెక్టార్ సూపర్వైజర్ సిహెచ్.దుర్గా భవాని అన్నారు. తల్లిపాల వారోత్సవాలు సందర్భంగా శనివారం ముప్పర్తిపాడు అంగన్వాడీ కేంద్రంలో జరిగిన అవగాహనా సదస్సులో పాల్గొని మాట్లాడారు. పుట్టిన బిడ్డకు ముర్రిపాలు పట్టడం వల్ల పిల్లలకు వ్యాధులు రాకుండా ఉంటాయని అన్నారు. ప్రతి బిడ్డకు తల్లిపాలు అందేవిధంగా మన సంకల్పం ఇవ్వాలన్నారు. అంతరాలను తొలగించి తల్లిపాల ప్రాముఖ్యతను ప్రతి తల్లి తెలుసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఒ జిఎస్ఎన్.ప్రసాద్, అంగన్వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

బిడ్డకు తల్లిపాలు పట్టడం వల్ల రొమ్ము కేన్సర్‌ను నివారించవచ్చుని ఎఎన్ఎం ఝాన్సీలక్ష్మి తెలిపారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా శనివారం జల్లి కాకినాడ పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమానికి సర్పంచి బాతు నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. తల్లిపాలల్లో విటమిన్లు, ఖనిజాలు అధికంగా ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్లు ధనలక్ష్మి, విజయకుమారి పాల్గొన్నారు

కాళ్ల: తల్లిపాలు అమృతంతో సమానమని సిడిపిఒ వి.వాణి విజయరత్నం అన్నారు. పెద అమిరం గ్రామంలో తల్లిపాల వారోత్సవాన్ని శనివారం నిర్వహించారు. గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. డాక్టర్. డి. సునీత, సూపెర్వైజర్లు కె. సూర్య కుమారి, పార్వతి, హెల్త్ సిబ్బంది సచివాలయం సిబ్బంది .అంగన్వాడీ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

పెనుగొండ: తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా బిడ్డ పుట్టిన గంటలోపు పిల్లవాడికి ముర్రిపాలు ఇవ్వాలని, దీని ద్వారా టీకాలాగా పనిచేస్తుందని నడిపూడి సర్పంచి బేబీ అన్నపూర్ణ అన్నారు. శనివారం అంగన్వాడీ కేంద్రంలో ఆధ్వర్యంలో బేబీ అన్నపూర్ణ మాట్లాడుతూ పుట్టిన ప్రతి బిడ్డకు తల్లిపాలు కనీసం ఆరు నెలలు ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ ఐసిడిఎస్ సూపర్వైజర్ రూతు కుమారి, సచివాలయం సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉండి: పుట్టిన శిశువుకు గంటలోపు తల్లిపాలు ఇవ్వడం వల్ల శిశువు ఆరోగ్యవంతంగా ఉండటమే కాకుండా రోగ నిరోధక శక్తిని కలిగి ఉంటుందని ఐసిడిఎస్ సిడిపిఒ వాణి విజయరత్నం అన్నారు. శనివారం ఉండి మండలం యండగండి, వెలివర్రు గ్రామాలలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా వారు మాట్లాడుతూ ప్రతి తల్లి తన బిడ్డకు తప్పనిసరిగా తల్లిపాలు ఇవ్వాలని దానివల్ల తల్లి బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ వి.నిర్మల, అంగన్వాడీ వర్కర్లు శ్యామల, చిట్టి మరియ, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

మొగల్తూరు : మొగల్తూరు పంచాయతీ పరిధి కొండవారిపాలెం, పెద్ద పల్లవ పాలెం గ్రామాలలో తల్లిపాల వారోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు శ్రీమంతాలు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందించారు. అనంతరం గ్రామంలో పిహెచ్‌సి సిబ్బంది సునీత, ఐ.దివ్యశ్రీ, కె.సాంబశివరావు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆచంట: శిశువుకు పుట్టిన గంటలోపు తల్లిపాలు ఇవ్వడం ద్వారా ఆ బిడ్డకు వ్యాధి నిరోధకత పెరుగుతుందని అంగన్వాడీ జిల్లా ఉపాధ్యక్షురాలు వైట్ల ఉషారాణి అన్నారు. శనివారం ఆచంట పంచాయతీ కౌరుపాలెంలో అంగన్వాడీ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పుట్టిన శిశువుకు మొదటి వ్యాధి నిరోధక టీకాగా తల్లిపాలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. ఈ సందర్భంగా గర్భిణులకు ఆహార నియమాలు, తల్లిపాల ప్రాముఖ్యత, వ్యక్తిగత పరిశుభ్రతకు తగిన సూచనలు సలహాలు ఇచ్చారు.

స్వాతంత్ర దినోత్సవ వేడుకులకు ఎంపిపికి ఆహ్వానం

ప్రజాశక్తి - వీరవాసరం

ఢిల్లీలో ఎర్రకోట వద్ద నిర్వహించే స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో పాల్గొనాలంటూ ఆహ్వానించారని ఎంపిపి వీరవల్లి దుర్గాభవాణి శనివారం తెలిపారు. గ్రామీణ పరిపాలనలో పాలుపంచుకునే మహిళా నేతల నాయకత్వానికి గుర్తింపు ఇచ్చే విధంగా స్థానిక సంస్థల మహిళ ప్రజాప్రతినిధులకు అవకాశం కల్పించినట్టు ఆమె తెలిపారు. మూడు ప్రాధాన్యత గల ప్రభుత్వ కార్యక్రమాలలో ప్రతిభ కనబర్చిన వారికి ఎంపికలో ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందని ఆమె అన్నారు. తన పాలనలో తాగునీరు, పారిశుధ్యం మెరుగుదల, రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగడం వల్ల స్వాతంత్ర్య వేడుకలలో పాల్గొనేందుకు అవకాశం వచ్చిందని ఎంపిపి తెలిపారు. పంచాయతీ రాజ్ వ్యవస్థలో మహిళ ప్రజాప్రతినిధులను ప్రోత్సహించే విధంగా ఈ వేడుకలలో పాల్గొనెందుకు అవకాశం ఇవ్వడం పట్ల ఎంపిపి సంతృప్తి వ్యక్తం చేస్తూ ప్రధానమంత్రి మోడీకి పత్రికా ముఖంగా కృతజ్ఞతలు తెలిపారు. పరిపాలనలో చురుకుగా పాల్గొనే విధంగా మహిళలను ప్రోత్సహించడం, మహిళా సాధికారిత, గ్రామీణ పాలన మెరుగుపరచడం ఈ ఆహ్వానం యొక్క ముఖ్యోద్దేశంగా తెలుస్తుంది.

మానవత ఆధ్వర్యాన విద్యార్థులకు ఉచిత బస్సు పాసులు

గణపవరం: గణపవరం జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులకు శనివారం మానవతా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత బస్సు పాస్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆర్‌టిసి తాడేపల్లిగూడెం డిపో మేనేజర్ మూర్తి మాట్లాడుతూ గ్రామాల్లో దాతల సహకారంతో విద్యార్థులకు బస్సుపాసులు అందజేస్తున్నట్లు తెలిపారు. స్థానిక టిడిపి నాయకులు కూసంపూడి సురేంద్రకుమార్ సహకారంతో విద్యార్థులకు ఉచిత బస్సు పాసులు అందజేస్తునట్లు చెప్పారు. హై స్కూల్‌కి వచ్చే దూర ప్రాంత విద్యార్థులకు బస్సు బస్సులు ఉపయోగపడతాయన్నారు. అనంతరం బస్సుపాసులు విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మానవతా అధ్యక్షులు బుద్ధవరపు పుల్లయ్య, డైరక్టర్లు కాకర్ల వినాయక, బొడ్డు శ్రీనివాసరావు, వంకాయల రామారావు పాల్గొన్నారు.

అంబటి రంగనాయకుల కుటుంబానికి పరామర్శ

యలమంచిలి: మండలంలోని కట్టుపాలెం గ్రామానికి చెందిన సిపిఎం మండల నాయకుడు అంబటి రంగనాయకుల సతీమణి కట్టుపాలెం గ్రామపంచాయతీలో సిపిఎం తరుపున వార్డు మెంబర్‌గా బాధ్యతలు వహిస్తున్న లక్ష్మి ఇటీవల మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం శనివారం అంబటి రంగనాయకుల కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ రంగనాయకులు పార్టీలపరంగా ఏ ఉద్యమంలో పాల్గొన్నా లక్ష్మి భర్తకు ఎంతో ప్రోత్సాహకరంగా ఉండేవారని, అటువంటి వ్యక్తిని కోల్పోవడం చాలా బాధాకరమని అన్నారు. బలరాం వెంట సిపిఎం మండల కార్యదర్శి కానేటి బాలరాజు, నాయకులు పడవల మాధవరావు, గొల్ల ఏడుకొండల శ్రీనివాస్, ముమ్మిడివరపు ఆంజనేయులు, తెన్నేటి స్టాలిన్, కోరం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పాలస్తీనాపై దాడులు ఆపాలి

ఆచంట: పాలస్తీనాపై మారణకాండ దాడులను తక్షణమే ఆపాలని సిపిఎం మండల కార్యదర్శి పిల్లి ప్రసాద్ డిమాండ్ చేశారు. పాలస్తీనాపై తక్షణమే దాడులు విరమించాలని కోరుతూ పాలస్తీనాకు మద్దతుగా శనివారం పోడూరులో సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో బొంతు శ్రీను, కాకర వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఉండి తహశీల్దార్‌గా నాగార్జున

ఉండి: ఉండి నూతన తహశీల్దార్‌గా కావడి నాగార్జునను నియమించినట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 1999 బ్యాచ్‌కి చెందిన కావడి నాగార్జున ఎక్సైజ్ శాఖలో 17 సంవత్సరాలు పనిచేసిన అనంతరం రెవెన్యూ శాఖకు బదిలీ అయ్యారు. తొలుత ఏలూరు జిల్లాలో డిప్యూటీ తహశీల్దార్‌గా బాధ్యతలు నిర్వర్తించి 2021వ సంవత్సరంలో నరసాపురం ఆర్‌డిఒ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పనిచేసి ఎన్నికల సమయంలో పాలకోడేరు తహశీల్దార్‌గా విధులు నిర్వహించారు. నూతన ప్రభుత్వం ఏర్పడిన అనంతరం బదిలీలలో భాగంగా కావడి నాగార్జున ఉండి తహశీల్దార్‌గా నియమితులైనట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

పెనుమంట్ర తహశీల్దార్‌గా రవికుమార్

పెనుమంట్ర : మండల కొత్త తహశీల్దార్‌గా వై.రవికుమార్‌కు నియమిస్తూ రెవెన్యూ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కృష్ణా జిల్లా బంటుమిల్లి తహశీల్దార్‌గా పనిచేస్తున్న రవికుమార్ సోమవారం ఇక్కడ విధుల్లో చేరవచ్చని కార్యాలయం ఉద్యోగులు తెలిపారు. గతంలో పెనుగొండ తహశీల్దార్‌గా సేవలు అందించిన రవికుమార్ సాధారణ ఎన్నికల నేపథ్యంలో జరిగిన బదిలీల్లో బంటుమిల్లి వెళ్లారు.

పంచదార పంపిణీ ఎప్పుడో!

కాళ్ల: ప్రభుత్వం బియ్యం కార్డు ఉన్న పేదలకు ప్రతినెలా 500 గ్రాముల పంచదార పంపిణీ చేస్తోంది. గత రెండు నెలల నుంచి పంచదార పంపిణీ చేయడం లేదు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో టిడిపి కూటమి ఘన విజయం సాధించిన తర్వాత ప్రతినెలా పేదలకు అందించే నిత్యావసర సరుకుల పంపిణీలో పంచదార రెండు నెలలుగా ఇవ్వకపోవడంతో ప్రజలు అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. గత వైసిపి ప్రభుత్వంలో బియ్యం, గోధుమపిండి, పంచదార ఇచ్చేవారు, ప్రస్తుతం బియ్యం, గోధుమపిండి మాత్రమే ఇస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నిత్యావసర సరుకులు పెరుగుతాయి అనుకుంటే తగ్గించేశారని వాపోతున్నారు. వచ్చేనెల నుంచి అయినా పంచదార వచ్చేలా చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సమిష్టిగా గ్రామాల అభివృద్ధికి కృషి

ఎంపిపి శిరీష విశ్వనాధరాజు

గాదిరాజు కనకరాజును సత్కరిస్తున్న అధికారులు

కాళ్ల: రాజకీయలకతీతంగా అందరం కలసికట్టుగా గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామని ఎంపిపి శిరీష విశ్వనాధరాజు అన్నారు. కాళ్ల ఎంపిపి శిరీష విశ్వనాధరాజు అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించారు. మండలంలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల అభివృద్ధి పనులపై చర్చించారు. అనంతరం సభ్యులు అడిగిన ప్రశ్నలకు, సమస్యలకు ప్రభుత్వం తరుపున సమాధానాలు చెబుతూ భరోసా ఇచ్చారు. అలాగే గత ప్రభుత్వ హయాంలో నిలిచిన పనులపై శాఖల వారీగా ప్రణాళికలు సిద్ధం చేస్తే దశలవారిగా అభివృద్ధి చేస్తామని అన్నారు. ఎంఇఒ -2వేంద్ర వెంకటేశ్వరరావు మాట్లాడుతూ స్కూల్ మేనేజ్ మెంట్ కమిటీ ఎన్నికలు ఈనెల 8వ తేదీ లోగా నిర్వహిస్తామన్నారు. జలజీవన్ మిషన్ తదితర నిర్మాణ పనులు స్థానిక నాయకులతో సమన్వయం చేసుకుంటూ అధికారులు వేగవంతంగా పూర్తిచేసేలా ప్రణాళికలు రూపొందించుకుంటున్నామని ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ తానింకి శ్రీనివాసరావు వివరించారు. వ్యాధుల నియంత్రణలో పరిశుభ్రత ప్రాముఖ్యతను పంచాయతీ అధికారులతో కలిసి వైద్యారోగ్య శాఖ సైతం గ్రామాల్లో విస్తృత ప్రచారాన్ని నిర్వహిస్తున్నామని డాక్టర్ డి.సునీత అన్నారు. జులై 31వ తేదీన ఉద్యోగ విరమణ చేసిన కాళ్ల ఎంఇఒ-2 గాదిరాజు కనకరాజును మండల ప్రజాప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి పి.సోమేశ్వరరావు, ఎంపిడిఒ జి.స్వాతి, జిల్లా సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు కొలుకులూరి ధర్మరాజు పాల్గొన్నారు.

కరెంట్ షాక్‌తో జూనియర్ లైన్‌మెన్ మృతి

ఆచంట: భీమలాపురం గ్రామంలో శనివారం ఉదయం వీధిలైట్లు రిపేరు చేస్తుండగా లైన్ మెన్‌కు విద్యుత్ షాక్ తగిలి మృతిచెందిన సంఘటన శనివారం ఉదయం భీమలాపురం గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం ప్రకారం భీమలాపురం సచివాలయంలో జూనియర్ లైన్‌మెన్‌గా యాళ్ల రాజు(30) విధులు నిర్వహిస్తున్నారు. శనివారం ఉదయం భీమలాపురం పంచాయతీ పరిధి కౌరు వారి వీధిలో స్ట్రీట్ లైన్ లైట్లు ఇటీవలే భారీ వర్షాలకు వెలగకపోవడంతో కౌరు వారి వీధి ప్రజలు సచివాలయంలో కంప్లైంట్ చేశారు. కంప్లైంట్ నిమిత్తం శనివారం ఉదయం సుమారు 11 గంటలకు సచివాలయ లైన్‌మెన్‌తోపాటు అదే పంచాయతీలో ప్రైవేట్ ఎలక్ట్రిషన్‌గా పనిచేస్తున్న కుసుమే వీరన్నలు కలిసి వీధిలైట్లు రిపేరు చేయడానికి ముందు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. ఈ నేపథ్యంలో సమీపంలో ఉన్న లైట్లు తీసుకురావడానికి వీరన్న వెళ్లగా అదే సమయంలో లైన్మెన్ రాజు ఎస్ఎస్ 24 ఎ 7/1 కరెంట్ పోల్ ఎక్కువగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పైనుంచి కింద పడిపోవడంతో ముక్కు నుంచి రక్తం కారింది. స్థానికులు సిఆర్‌పి చేసి అనంతరం అంబులెన్స్‌లో పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకు వెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు కలరు. పెద్ద కుమార్తె ఎల్‌కెజి చదువుతుండగా చిన్న కుమార్తె పుట్టి రెండు నెలల కావస్తుందని స్థానికులు చెబుతున్నారు. భార్య గృహనిగా ఉంటుంది. ఈ తరహాలో పోలీసులు, ఎలక్ట్రికల్ సిబ్బంది సంఘటన స్థలాన్ని పరిశీలించి స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. రాజు సొంత ఊరు వల్లూరు కాగా ఉద్యోగం మాత్రం భీమలాపురంలో చేస్తున్నారు. రాజు ఆకస్మికంగా మృతి చెందడంతో వల్లూరులో విషాద చాయలు అలుముకున్నాయి. కాగా యాళ్లరాజు మృతి అనుమానస్పదంగా ఉన్నట్లు పోలీసులు, ఎలక్ట్రికల్ అధికారులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

సివిల్ జడ్జి(సీనియర్ డివిజన్) జి.గంగరాజు

నరసాపురం: సెప్టెంబర్ 14వ తేదీన జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌లో ఆయా కోర్టులలో పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసులను ఉభయ పార్టీల సమక్షంలో సమన్యాయం అందించుటలో పోలీస్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని నరసాపురం సివిల్ జడ్జి(సీనియర్ డివిజన్) జి.గంగరాజు అన్నారు. శనివారం కోర్ట్ హాల్ నందు పోలీసు ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో అన్నారు. ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ కోర్టులలో పెండింగ్ తగ్గించడానికి, కక్షిదారులకు కేసుల నుంచి త్వరితగతిన ఉపశమనం కలిగించడానికి ఈ జాతీయ లోక్ అదాలత్ ఎంతగానో ఉపయోగపడుతోందనీ, కానీ సరైన అవగాహన లేకపోవడం వల్ల కక్షిదారులు రాజీకి ముందుకు రాలేకపోతున్నారని న్యాయమూర్తి అన్నారు. అందుకే మధ్యవర్తిత్వం ద్వారా కూడా రాజీయే రాజ మార్గం అని కక్షిదారులకి తెలియజేయాలని పోలీసులను ఆదేశించారు. క్షణికావేశంలో చేసిన నేరాన్ని సమాధానంతో పరిష్కరించడానికి ప్రయత్నం చేయాలన్నారు. తప్పని పరిస్థితుల్లో కోర్టుకి రాలేని వారు వారికి సమీపంలో ఉన్న కోర్ట్ వద్దకు వెళ్లి గూగుల్ మీట్ ద్వారా కూడా కేసులను రాజీ చేసుకోవచ్చునని, ఈసారి జరిగే లోక్ అదాలత్ ద్వారా ఎక్కువ కేసులు రాజీ చేయడానికి రాజీకి యోగ్యమైన కేసులను గుర్తించి అందలి పార్టీలకు నోటీసులు ఇచి ముందస్తు లోక్ అదాలత్‌లు నిర్వహిస్తున్నట్లు అందుకు పోలీస్ అధికారులు అందరూ సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) ఆర్.వరలక్ష్మి, అదనపు సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) కె.శ్రీనివాస్, నర్సాపురం పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కెవి.స్వామి, గ్రామీణ సిఐ కె.గోవింద రాజులు, రూరల్ ఎస్ఐ హాజరైనారు.

'ప్రకృతి వైపరీత్యాలను తట్టుకొని ముందుకు సాగాలి'

పెనుమంట్ర: తరుచుగా వచ్చే ప్రకృతి వైపరీత్యాలను ఫారం అందించే సూచనలు, సలహాలతో ముందుకు సాగాలని మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సహ పరిశోధనా సంచాలకులు డాక్టర్ టి.శ్రీనివాస్ అన్నారు. శనివారం మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రాంగణంలో నిర్వహించిన శిక్షణ, సందర్శన కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించారు. జిల్లా వ్యవసాయ అధికారి జెడ్.వెంకటేశ్వర రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా డాక్టర్ టి.శ్రీనివాస్ మాట్లాడుతూ 2024-25వ సంవత్సరానికి గాను మొట్టమొదటి శిక్షణ, సందర్శన కార్యక్రమం నిర్వహించుకోవడం, దానికి పెద్ద మొత్తంలో వ్యవసాయ శాఖ అధికారులు హాజరుకావడం ఎంతో సంతోషకరమని తెలియజేశారు. ఈ సందర్భంగా గత జులై మాసంలో కురిసిన అధిక వర్షాల కారణంగా దెబ్బతిన్న వరిచేలను మార్టేరు శాస్త్రవేత్తల బృందం ఎప్పటికప్పుడు పర్యటించి, నష్ట నివారణ చర్యలపై ఎప్పటికప్పుడు సమాచారం అందించామని తెలిపారు. గత మాసంలో కురిసిన వర్షాల వల్ల కొన్నిచోట్ల సకాలంలో నాట్లు వేయలేక, నారుమడులు పోయాయని, ముదురు నారు నాటవలసిన పరిస్తితులలో నారు కొసలను తుంచి దగ్గర దగ్గరగా వేసుకోవాలని, సిఫారసు చేసిన ఎరువుల మోతాదుకంటే 2 శాతం పెంచి రెండు దఫాలుగా వేసుకోవాలని సూచించారు. వరి పొలాలు దెబ్బతిన్న ప్రాంతాలలో రైతులు పిఆర్ 126 రకం సాగుకు మొగ్గుచూపుతున్నారని, అటువంటి ప్రాంతాలలో బాక్టీరియా ఆకు ఎండు తెగులుపై అవగాహన కల్పించాలని కోరారు. అంతేకాక పొటాష్ వాడకం పెంచవలసిన ఆవశ్యకత ఎంతో ఉన్నదని, దీనివల్ల పంటకు చీడపీడలను తట్టుకునే శక్తి పెరుగుతుందని తెలిపారు. ప్రతీ నెల జరిగే ఈ కార్యక్రమంలో ఎడిఎలు తమ ప్రాంతాలలో సాగుచేస్తున్న చిరుసంచులపై పూర్తి సమాచారం అందించాలని తెలిపారు. జెడ్.వెంకటేశ్వర రావు క్లుప్తంగా జిల్లాలోని పంటలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి వివరించారు. అధిక వర్షాలకు దెబ్బతిన్న ప్రాంతాలలో 80 శాతం రాయితీపై స్వల్పకాలిక రకాలను అందించడానికి సమాయత్తం చేశామని తెలిపారు.

తేరుకోని కనకాయలంక కాజ్ వే

యలమంచిలి : గోదావరి వరద పూర్తిగా తగ్గిపోవడంతో లంక గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఇంకా మండలంలోని కనకాయల లంక కాజ్‌వేపై మాత్రం శనివారం సాయంత్రంకి రెండు అడుగుల మేర వరద నీరు ప్రవహిస్తుంది. దీంతో ఆ గ్రామ ప్రజలకు శనివారం కూడా పడవ ప్రయాణం తప్పలేదు. వరద తాకిడికి గురైన దొడ్డిపట్ల, పెదలంక, బాడవ, యలమంచిలి లంక, లక్ష్మీపాలెం, అబ్బిరాజుపాలెం తదితర గ్రామాల్లో పంచాయతీ సిబ్బంది రహదారులపై నిలిచిన బురదను తొలగించి బ్లీచింగ్ చల్లి, శానిటేషన్‌ను దారిలోకి తెచ్చేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు.

CHANGE OF NAME

Gadugoyyala Subbanna, S/o Vigneswaradu, D.No.12-58-6, Housing Board Colony, Tanuku, Tanuku Mandal, W.G.Dist. I have changed my name from **Gadugoyyila Subbanna (Old Name)** to **Gadugoyyala Subbanna (New Name)** Now onwards use my new for all further Transactions.

CHANGE OF NAME

Gadugoyyala Subbalakshmi, W/o Subbanna, D.No.12-58-6, Housing Board Colony, Tanuku, Tanuku Mandal, W.G.Dist. I have changed my name from **Gadugoyyila Subbalakshmi (Old Name)** to **Gadugoyyala Subbalakshmi (New Name)** Now onwards use my new for all further Transactions.

మహారాజశ్రీ కొవ్వూరు Ist Addl. జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S. 8/2023

Between:

వాది: శ్రీమతి వింటి దుర్గాదేవి, W/o. లేటు వెంకటేష్, హిందూ, వయస్సు 25, స్త్రీ, పోషణ, డో.నెం. 2-41, భీమోలు, Now since W/o. Tota Srinu, సరిపల్లె, కొయ్యలగూడెం మండలం, KJCJC.

Vs

శ్రీవింటి పేర్రాజు వెంకటరత్నం, వగైరాలు ...ప్రతివాదులు

4వ ప్రతివాది శ్రీమతి తెన్నేటి దుర్గ, W/o. దీక్షితులు, హిందూ, వయస్సు 29 సం॥లు, స్త్రీ, హౌస్ వైఫ్, కన్నాపురం రోడ్డు, కొయ్యలగూడెం, కొయ్యలగూడెం మండలం, JRG JCJC.

పై నెంబరు దావాలో 4వ ప్రతివాదికి కోర్టు ద్వారా దావా సమన్లు , రిజిస్టర్ పోస్టు ద్వారాను పంపించినన్ను అమలు జరుగనందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం యీ ప్రకటన వేయడమైనది. యీ నెంబరులో 4వ ప్రతివాది అయిన శ్రీమతి తెన్నేటి దుర్గ, W/o. దీక్షితులు, కొయ్యలగూడెం అనువారు **ది. 12-8-2024వ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారు పిలిపించే టైముకు స్వయంగా గానీ హాజరై ఆక్షేపణలు ఉన్న యెడల తెలియపరచుకొనవలెను. లేనియెడల Ex-party చేసి పరోక్షమున తీర్మానించడమగును.

వాయిదా తేది: 12-8-2024

CH.NAGA KUMAR
Advocate, Kovvur
Cell: 9440985149

పాస్‌పోర్టు పోయినది

సూరెడ్డి లక్ష్మణకుమార్ తండ్రి: సూరెడ్డి ఎర్రిబాబు అను నేను నాయొక్క పాస్‌పోర్టు పడిపోయినది. ఇంటి నుండి జిరాక్స్ సెంటర్‌కు వెళుతుండగా నా యొక్క పాస్‌పోర్టు పడిపోయినది. పాస్‌పోర్టు నెం. G6449930 గల పాస్‌పోర్టు ఎవరికైనా దొరికినయెడల ఈక్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

సూరెడ్డి లక్ష్మణకుమార్
తండ్రి: ఎర్రిబాబు
డోర్ నెం. 2-84,
కామాక్షమ్మ టెంపుల్, పెనుగొండ,
పెనుగొండ మండలం, ప.గో.జిల్లా
పిన్: 534320
సెల్: 93468 22743

పాస్‌పోర్టు పోయినది

ప॥గో॥జిల్లా, నరసాపురం మండలం, బియ్యపుతిప్ప గ్రామమునకు చెందిన ఓడుగు శ్రీనివాస్, తండ్రి: నరసింహస్వామి అయిన నాయొక్క పాస్‌పోర్టు పోయినది. నాయొక్క పాస్‌పోర్టు నంబర్: 2600636 గల పాస్‌పోర్టు **ది.25-07-2024వ తేదీన** నరసాపురంలో జిరాక్స్ తీయించుకొని నరసాపురం నుండి బియ్యపుతిప్ప వెలుతుండగా మార్గ మధ్యలో నాయొక్క పాస్‌పోర్టు పడిపోయింది. ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

ఓడుగు శ్రీనివాస్
తండ్రి: నరసింహస్వామి
బియ్యపుతిప్ప
నరసాపురం మండలం, ప.గో.జిల్లా
పిన్: 534275
సెల్: 97056 86308

సర్టిఫికేట్ పోయినది

పశ్చిమ గోదావరి జిల్లా, భీమవరం టౌన్, మర్రెళ్ళవారి రోడ్, డోర్‌నెం.24-4-6కు చెందిన తోట వెంకటేశ్వరరావు S/o.రమణయ్య (లేటు) అను నా యొక్క ఒరిజినల్ సర్టిఫికెట్స్ పోయినది. సర్టిఫికెట్ నెంబర్ : AP6/ME/087/19 Dated 05-02-2020 Issued By MPEDA SRO, Bhimavaram ది. 06.07.2024 తేదీన మా ఇంటి వద్ద నుండి భీమవరం ఓల్డ్ బస్టాండ్‌కి సర్టిఫికేట్ జిరాక్స్ తీయించు నిమిత్తం నా యొక్క మోటరు సైకిల్ పై ఒరిజినల్ సర్టిఫికెట్స్ తీసుకు వెళ్ళచుండగా మార్గం మధ్యలో పడిపోయినవి. దొరికిన వారు ఈ క్రింద అడ్రస్‌కు తెలియజేయగలరు.

THE MARINE PRODUCTS EXPORT DEVELOPMENT AUTHORITY
Sub Regional Division, 2-1-15, 2nd Floor,
GRK Complex, Opp. to BPCL Bunk, J. P. Road,
BHIMAVARAM-534 202, W. G. Dt., A.P